ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

# "పాలకొల్లు రామలింగస్వామి ' కొత్త దృశ్యం' కథ - మేదర వృత్తి పై ఆధునికత ప్రభావం"

**1. లక్ష్మణరావు పుక్కళ్ళ ,**

పరిశోధక విద్యార్థి, తెలుగు మరియు ప్రాచ్య భాషా విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు -522 510, ఫోన్ నెం: 8919549360

**2. ఆచార్య ఎన్. వి. కృష్ణా రావు,**

తెలుగు మరియు ప్రాచ్య భాషా విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు - 522510, ఫోన్ నెం :9490218173,

ఈ మెయిల్ : vkraonarisetty@yahoo.com

Article Received: 10/01/2026

Article Accepted: 25/02/2026

Published Online: 26/02/2026

DOI:10.53414/Sahithyatharangini.2026.3.1.165

**వ్యాస సంగ్రహం :**

ధనవంతులు మరింత ధనవంతులు కావడానికి పేదవాడి సొంతంగా బతికే దారిని కూడా మూసేస్తున్నారని సంగమేసు గ్రహిస్తాడు. దీనిని రచయిత 'ఐటెక్కు పెపంచికం' (హైటెక్ ప్రపంచం) అని సంబోధించారు, ఇక్కడ పేదవాడిని అడుగేసి మట్టేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చివరికి విస్తళ్లలోని ఆహారం కోసం కోళ్లను పందులు, ఆ పందులను కుక్కలు తరిమేసే దృశ్యం ద్వారా బలవంతుడు బలహీనుడిని తొక్కివేసే సామాజిక వాస్తవాన్ని రచయిత 'కొత్త దృశ్యం'గా చిత్రించారు.

**కీ పాయింట్స్ :** కులవృత్తులు, ఆధునిక సమాజం, కార్పొరేట్ వ్యవస్థ, కుటుంబ వ్యవస్థలో మార్పులు ...

## 1. పరిచయం:

ఉత్తరాంధ్ర ప్రాంతం తెలుగు సాహిత్యానికి ఎందరో ప్రసిద్ధ రచయితలను అందించింది. గురజాడ అప్పారావు, శ్రీశ్రీ, రావిశాస్త్రి, కాళీపట్నం రామారావు, చాగంటి సోమయాజులు (చాసో), పతంజలి వంటి వారు ఉత్తరాంధ్ర సాహితీ వైభవానికి ప్రతిరూపాలు. వీరిని అనుసరిస్తూ అట్టాడ అప్పలనాయుడు, గంటేడ

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

గౌరి నాయుడు వంటి వారెందరో రచయితలు రాస్తూనే ఉన్నారు. వీరు కథలు, నవలలు, కవిత్వం ద్వారా తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. వీరి కోవలో ఉత్తరాంధ్ర ప్రజా జీవనాన్ని తన రచనలు ద్వారా ప్రతిఫలింప చేస్తున్నారు పాలకొల్లు రామలింగ స్వామి. రామలింగస్వామి రాసిన 13 కథలతో "కొత్త బతుకు" అనే సంకలనం 2011 సంవత్సరంలో వచ్చింది. అందులోనిదే ఈ ' కొత్త దృశ్యం' కథ.

**2.' కొత్త దృశ్యం' కథ-ఇతివృత్తం:**

మారుతున్న కాలంలో కార్పొరేట్ శక్తుల రాక వల్ల సామాన్యుల కులవృత్తులు మరియు చిన్న వ్యాపారాలు ఎలా విచ్ఛిన్నమవుతున్నాయో ఈ కథ కళ్లకు కట్టినట్లు వివరిస్తుంది.

సంగమేసు మరియు అతని భార్య కంచెమ్మ మేదర వృత్తి (వెదురుతో బుట్టలు, తట్టలు అల్లడం) చేస్తూ జీవిస్తుంటారు. ఒకప్పుడు వీరి వృత్తికి రైతుల దగ్గర మంచి గిరాకీ ఉండేది, కానీ కాలక్రమేణా గిట్టుబాటు లేక చాలా మంది మేదరులు వలస వెళ్ళడం లేదా కూలీలుగా మారిపోవడం జరిగింది. సంగమేసు కుమారుడు నారాయణ సైకిల్‌పై బుట్టలు అమ్ముకుంటూ తన కుటుంబాన్ని పోషించుకోలేక ఇబ్బంది పడుతుంటాడు. అలాగే, అతని మేనల్లుడు కృష్ణ ఒక చికెన్ సెంటర్ నడుపుతూ బాగుపడ్డాడని అనుకుంటారు.

గ్రామం మధ్యలో ఒక కార్పొరేట్ పౌల్ట్రీ స్టాక్ పాయింట్ రావడంతో, వారు హోల్‌సేల్ ధరకే చికెన్ అమ్మడం మొదలుపెడతారు. దీనివల్ల స్థానిక చిన్న చికెన్ కొట్లు మూతపడతాయి. చివరకు ఆ కార్పొరేట్ యజమాని, ఉపాధి కోల్పోయిన వారికే తన వద్ద తక్కువ కూలికి (రోజుకు యాభై రూపాయలు) పని ఇస్తానని అంటాడు. సంగమేసు మరో కుమారుడు రవి విశాఖపట్నంలోని 'రిలయన్స్ ఫ్రెష్'లో హెల్పర్‌గా చేరతాడు. అక్కడ వస్తువులు తక్కువ ధరకు దొరుకుతాయని, తన యజమాని దేశంలోనే అతిపెద్ద ధనవంతుడని రవి ఉత్సాహంగా చెబుతాడు. కానీ సంగమేసు ఆలోచనలో పడతాడు: పెద్ద కంపెనీలు ఇలా అన్ని వ్యాపారాల్లోకి వస్తే, వీధుల్లో గంపలతో, తోపుడు బండ్లతో అమ్ముకునే పేదవారి పరిస్థితి ఏమిటి? అని ఆవేదన వ్యక్తం చేస్తాడు.

కథ చివరలో సంగమేసు తన ఇంటి ముందు ఒక దృశ్యాన్ని చూస్తాడు. విస్తళ్లలోని ఆహారం కోసం మొదట కోళ్లు వస్తే, వాటిని పందులు తరిమేస్తాయి. ఆ తర్వాత ఆ పందులను కుక్కలు దౌర్జన్యంగా తరిమేసి ఆ విస్తళ్లను ఆక్రమించుకుంటాయి. బలిష్ఠమైనవి బలహీనమైన వాటిని తొక్కివేసే ఈ సామాజిక స్థితిని, అంటే పెద్ద చేప చిన్న చేపను మింగేసే పెట్టుబడిదారీ విధానాన్ని సంగమేసు 'కొత్త దృశ్యం'గా గ్రహిస్తాడు. ఇది ప్రస్తుత ఆర్థిక ప్రపంచంలో పేదవాడు తన ఉనికిని కోల్పోతున్నాడనే చేదు నిజానికి ప్రతీక.

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

### 3. పాత్ర చిత్రణ :

### 3.1. సంగమేసు:

'కొత్త దృశ్యం' కథలో సంగమేసు ప్రధాన పాత్ర. మారుతున్న కాలంలో కులవృత్తులు అంతరించిపోవడం మరియు కార్పొరేట్ శక్తుల ఆధిపత్యం వల్ల సామాన్యులు ఎదుర్కొంటున్న కష్టాలకు ఇతని పాత్ర ఒక ప్రతిబింబం.

సంగమేసు మేదర వృత్తి (వెదురుతో బుట్టలు, తట్టలు అల్లడం) చేసే వ్యక్తి. ఇతను తన భార్య కంచెమ్మతో కలిసి కష్టపడి పని చేస్తాడు. ఒకప్పుడు వీరి వృత్తికి గ్రామంలో మంచి గిరాకీ ఉండేదని, రైతులు ధాన్యం నిల్వకు 'గరిసెలు', బుట్టలు చేయించుకునేవారని అతను గుర్తు చేసుకుంటాడు.

సంగమేసుకు ఇద్దరు కుమారులు (నారాయణ, రవి) మరియు ఒక కుమార్తె (మంగ) ఉన్నారు. నారాయణ తండ్రి నుండి వేరుపడి సైకిల్‌పై బుట్టలు అమ్ముతూ కుటుంబాన్ని పోషించుకుంటాడు. రవి విశాఖపట్నంలోని ఒక పెద్ద కార్పొరేట్ షాపులో హెల్పర్‌గా పనిచేస్తాడు. మంగ వైధవ్యం వల్ల పుట్టింట్లోనే ఉంటుంది. సంగమేసు మేదర కులస్తులకు 'సంఘం పెద్ద' గా వ్యవహరిస్తాడు. కార్పొరేట్ పాల్రీ సెంటర్ వల్ల చిన్న వ్యాపారులు నష్టపోయినప్పుడు, వారు సమస్య పరిష్కారం కోసం సంగమేసు దగ్గరకు వస్తారు. తన మేనల్లుడు కృష్ణ కోపంతో కార్పొరేట్ యజమానిని ఎదిరించినప్పుడు, పరిస్థితిని చక్కదిద్దడానికి సంగమేసు ఆ యజమానిని బ్రతిమాలి శాంతింపజేస్తాడు. తన కుమారుడు రవి పని చేసే 'రిలయన్స్ ఫ్రెష్' వంటి పెద్ద సంస్థలు చిన్న వ్యాపారాల్లోకి రావడం వల్ల, వీధుల్లో గంపలతో, తోపుడు బండ్లతో అమ్ముకునే పేదవారి పరిస్థితి ఏమవుతుందని అతను ఆవేదన చెందుతాడు. ధనవంతులు మరింత ధనవంతులు కావడానికి పేదవాడి సొంతంగా బతికే దారిని కూడా మూసేస్తున్నారని అతను భావిస్తాడు.

కథ చివరలో, విస్తళ్లలోని ఆహారం కోసం కోళ్లను పందులు, ఆ పందులను కుక్కలు తరిమేసే దృశ్యాన్ని చూసి, అది ప్రస్తుత సమాజంలో బలవంతులు బలహీనులను తొక్కివేసే 'కొత్త దృశ్యం' అని గ్రహిస్తాడు. సంగమేసు పాత్ర ద్వారా రచయిత ఒక అనుభవజ్ఞుడైన వృద్ధుడి కళ్ళతో ఆధునిక ఆర్థిక వ్యవస్థలోని క్రూరత్వాన్ని మనకు చూపిస్తారు.

### 3.2. కంచెమ్మ:

కంచెమ్మ సంగమేసు భార్య. తన భర్త సంగమేసుతో కలిసి మేదర వృత్తిని నిర్వహిస్తుంది. ఆమె వెదురు తడపలతో చాపలు అల్లడం, బుట్టలు, తట్టలు, చేటలు తయారు చేయడంలో భర్తకు చేదోడువాదోడుగా ఉంటుంది. ఆమెకు నారాయణ, రవి అనే ఇద్దరు కుమారులు మరియు మంగ అనే

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

కుమార్తె ఉన్నారు. తన కుమారుడు నారాయణ పెళ్ళయిన పది నెలలకే విడిగా వెళ్ళిపోవడాన్ని ఆమె తప్పుగా భావిస్తుంది.

కంచెమ్మ నిక్కచ్చిగా మాట్లాడే మనస్తత్వం కలిగిన వ్యక్తి. తన కొడుకు నారాయణ వచ్చి వెదురు బొద్దుల కోసం డబ్బులు అడిగినప్పుడు, "మేము మేడలు మిద్దెలు కట్టేసి కాలు మీద కాలు వేసుకుని కూర్చుని తినడం లేదు" అని కోపంగా బదులిస్తుంది. పైకి కఠినంగా కనిపిస్తున్నప్పటికీ, లోలోపల కొడుకు పట్ల మెత్తదనంతోనే ఉంటుంది. ఆమె చాలా కష్టజీవి. కథలో ఆమె నిరంతరం చాపలు అల్లుతూ, వాటి అంచులను కర్రదుక్కతో మోదుతూ పనిలో నిమగ్నమై కనిపిస్తుంది. మారుతున్న కాలంలో కులవృత్తులు దెబ్బతినడం గురించి ఆమె తన భర్తతో చర్చిస్తుంది. చదువుకున్నా ఉద్యోగాలు లేని ఆచారి మేస్త్రీ పిల్లల పరిస్థితిని చూసి, వారు కనీసం కులవృత్తి నేర్చుకుని ఉంటే బాగుండేదని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తుంది. కంచెమ్మ పాత్ర ఒక సగటు గ్రామీణ శ్రమజీవి మహిళను, తన వృత్తిని నమ్ముకుని కుటుంబాన్ని కాపాడుకోవాలని తాపత్రయపడే తల్లిని ప్రతిబింబిస్తుంది.

### 3.3. నారాయణ:

ఇతను సంగమేసు మరియు కంచెమ్మల కుమారుడు. నారాయణ తన భార్యతో కలిసి అల్లిన తట్టలు, బుట్టలు, చేటలు వంటి మేదర వస్తువులను సైకిల్‌పై మెట్టుపాక సెంటరుకు తీసుకెళ్లి అమ్ముతుంటాడు. ఉదయం వెళ్ళి సాయంత్రానికి తిరిగి రావడం అతని దినచర్య. పెళ్ళయిన కేవలం పది నెలలకే తన తండ్రి నుండి వేరుపడి సొంతంగా కాపురం పెట్టాడు. ఇతనికి చిన్న పిల్లలు ఉన్నారు. తల్లి కంచెమ్మ దృష్టిలో అతను తండ్రి నుండి వేరుపడటమే అతను చేసిన పెద్ద తప్పు. నారాయణ ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. బజారులో బేరాలు లేక "ఈగలు తోలుకోవాల్సిన" పరిస్థితి ఉందని, వచ్చిన కొద్దిపాటి డబ్బులు కూడా తన పిల్లల మందులకే ఖర్చయిపోతున్నాయని అతను ఆవేదన వ్యక్తం చేస్తాడు.

నారాయణ కొత్తగా బుట్టలు అల్లడానికి అవసరమైన వెదురు బొద్దులను సంతలో కొనమని, సాయంత్రం డబ్బులు ఇస్తానని తండ్రిని కోరతాడు. తల్లి కంచెమ్మ అతనిపై కోపంగా ఉంటుంది. "మేమేమి మేడలు మిద్దెలు కట్టలేదు, నీకు బొద్దులు కొనడానికి మా దగ్గర డబ్బుల్లేవు" అని విసుక్కుంటుంది. ఆమె అతన్ని 'గండడు' అని కూడా పిలుస్తుంది. తండ్రి సంగమేసు మాత్రం కొడుకు కష్టాన్ని చూసి జాలిపడతాడు. తన ఆపరేషన్ కోసం దాచుకున్న డబ్బులు ఉన్నా, కొడుకు బాధ చూడలేక "నేనేదోలా చూస్తానులే, నువ్వు

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

వెళ్ళు" అని ధైర్యం చెబుతాడు. నారాయణ పాత్ర ద్వారా, కులవృత్తిని నమ్ముకుని స్వతంత్రంగా బతకాలని ప్రయత్నించి ఆర్థికంగా సతమతమవుతున్న యువతరపు ప్రతినిధిని రచయిత మనకు చూపిస్తారు.

**4. సామాజిక అంశాలు :**

పాలకొల్లు రామలింగస్వామి రచించిన 'కొత్త దృశ్యం' కథలో ప్రధానంగా మారుతున్న కాలంలో సామాన్యుల ఆర్థిక స్థితిగతులు మరియు కార్పొరేట్ శక్తుల రాక వల్ల కలిగే సామాజిక మార్పులను చర్చించారు. ఈ కథలో కనిపించే ముఖ్యమైన సామాజిక అంశాలు:

4.**1. కులవృత్తుల విచ్ఛిన్నం:**

ఒకప్పుడు మేదర వృత్తికి గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో మంచి ప్రాధాన్యత ఉండేది. రైతులు ధాన్యం నిల్వకు గరిసెలు, బుట్టలు, తట్టలు చేయించుకునేవారు. కానీ నేటి పరిస్థితిని వివరిస్తూ సంగమేసు అతని భార్య కంచెమ్మతో మేదర వృత్తి గురించి ఇలా అంటాడు "ఏం వృత్తినేయే!... ఆ బంగారప్పని కూడా మనమేదరపని లాగుంది!సావుకారి సావులొచ్చి కంసాళ్లు... ఎవసాయాలు కుదేలయి మనవూమూలపడిపోనేదేటి...? కష్టం ఎక్కువ... రాబడి తక్కువ.. ఒకప్పుడు తట్టలకని,బుట్టలకని, చేటలకని, మూతి బుట్టలకని, గరిసెలకని, గంపలకని...కోళ్ళగూళ్ళుకని, సెప్పి సెయించుకోని మరీ రైతులొట్టికెల్లోలు ! మనవు గూడాలారీల్ల లోడుల్లోటి ఎక్కడెక్కడికో పంపోల్లం !... మరి ఇప్పుడవన్నీ ఉన్నాయేటి!?...గిట్టుబాటు నేక బూములు తాకట్టేట్టిసి... పల్లంకేసి రైతులొలసపోతున్రు"అంటూ నేడు రైతులు భూములను తాకట్టు పెట్టడం, వలస వెళ్లడం వల్ల ఈ వృత్తికి గిట్టుబాటు లేకుండా పోయింది. కష్టం ఎక్కువ, రాబడి తక్కువ కావడంతో చాలా మంది ఈ వృత్తిని వదిలేసి వేరే పనుల వైపు మొగ్గు చూపుతున్నారు.

4.**2. కార్పొరేట్ శక్తుల ఆధిపత్యం:**

గ్రామం మధ్యలోకి కార్పొరేట్ పౌల్ట్రీ 'స్టాక్ పాయింట్' రావడం వల్ల, వారు తక్కువ ధరకే చికెన్ అమ్మడం మొదలుపెట్టారు. దీనివల్ల స్థానిక చిన్న చికెన్ కొట్లు మూతపడే పరిస్థితి ఏర్పడింది. అలాగే, 'రిలయన్స్ ఫ్రెష్' వంటి పెద్ద సంస్థలు పండ్లు, కూరగాయల వ్యాపారంలోకి రావడం వల్ల, వీధుల్లో గంపలతో, తోపుడు బండ్లతో అమ్ముకునే పేదవారి బతుకుదెరువు దెబ్బతింటుందని సంగమేసు ఆవేదన వ్యక్తం చేస్తాడు.

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-1, (Jan/Feb/Mar), 2026

"అవునోరేయ్ బావ్ !... అతగానికి లచ్చలాస్తి వుందంతన్నావ్ గదా.. మరలాంటప్పుడు ఇటువంటి సిల్లరమల్లర దుకాణాలెందుకు సెప్మి... రోడ్లమీద... వీదుల్లంట గంపలతోని, తోపుడుబల్లతోని, రైతు బజార్లంట అమ్ముకునోల్ల గతేటికావాలి.... ఆల్లన్నేయం అయిపోరా?!"

**4.3. శ్రమ దోపిడీ మరియు కూలీలుగా మారడం:**

సొంతంగా వ్యాపారం చేసుకునే చిన్న వ్యాపారులను దెబ్బతీసి, చివరకు వారినే తమ వద్ద తక్కువ కూలీకి పనిలో పెట్టుకోవడం అనే కార్పొరేట్ తంత్రాన్ని ఈ కథ ఎత్తిచూపింది. "అయ్యా!....నాకు వైజాగులో పని దొరికిందిరా!" గచ్చుమీద కూర్చుంటున్నతండ్రితో సంతోషంగా అన్నాడు. రవి."పోన్నేరే బావు!... మంచిదే!... ఎందులో.. ఒకందులో... నాలుగుడబ్బులొత్తే అంతే సేన!... ఇంతకీ ఏట్రా ఉష్గోగం?" మొహం తుడుచుకుంటున్నసంగమేసులో కూడా సంతోషం.ఇంటి"రిలయన్స్ ఫ్రెష్ షాపులో హెల్పర్... నెలకు మూడువేలు జీతం...బజారులో కన్నా తక్కువ రేటుకే మా షాపులో పళ్ళు, కూరగాయలు,సామాన్లు దొరుకుతాయి. ప్యాక్ చేసి ఇవ్వడమే నా డ్యూటీ... నాలాగే చాలామందిపనిచేస్తున్నారక్కడ." ఉత్సాహంగా అన్నాడు రవి...."అవున్రా... నాకు తెలీక అడుగుతున్నా... మీ అందరికీ వేలకొద్ది జీతాలిచ్చేత్తేపాపం ఆ కూరల కొట్టులో ఆడికేటి కిడతాది.... మీ ఓనరుకాడ అంత డబ్బుందేటి?"అమాయకంగా అన్న తండ్రి వైపు పెద్దగా నవ్వుతూ చూశాడు రవి." దీనివల్ల శ్రమజీవులు యజమానులుగా కాకుండా, కేవలం కూలీలుగా మిగిలిపోతున్నారు.

**4.4. నిరుద్యోగ సమస్య:**

చదువుకున్నా ఉద్యోగాలు లేక ఇబ్బంది పడుతున్న యువత పరిస్థితిని రచయిత ప్రస్తావించారు. ఆచారి మేస్త్రి పిల్లలు చదువుకున్నా ఉపాధి లేక ఇబ్బంది పడటం, వారు కనీసం కులవృత్తి అయినా నేర్చుకుని ఉంటే బాగుండేదని పాత్రలు చర్చించుకుంటాయి.

**5.రచనా శైలి:**

పాలకొల్లు రామలింగస్వామి రచించిన 'కొత్త దృశ్యం' కథా రచనలో రచయిత అనుసరించిన శైలి అత్యంత సహజంగా, గ్రామీణ వాతావరణాన్ని కళ్లకు కట్టేలా ఉంటుంది. ఈ కథా శైలిలోని ముఖ్యాంశాలు-

5.**1. పాత్రోచిత భాష (యాస):**

రచయిత ఈ కథలో పాత్రల స్వభావానికి మరియు వారు నివసించే ప్రాంతానికి తగ్గట్టుగా ప్రాంతీయ యాసను (ఉత్తరాంధ్ర/గోదావరి జిల్లాల మాండలికం) అద్భుతంగా ఉపయోగించారు. ఉదాహరణకు:

"సెప్పినట్టిగ", "ఎలిపొచ్చేసినాను", "కూకోని తింతన్నాం", "అద్దంపద్దం", "ఐటెక్కు పెపంచికం" వంటి పదప్రయోగాలు కథకు వాస్తవికతను చేకూర్చాయి.

**5.2. సంభాషణాత్మక శైలి:**

కథా గమనం ఎక్కువగా పాత్రల మధ్య జరిగే సంభాషణల ద్వారా సాగుతుంది. సంగమేసు, కంచెమ్మల మధ్య జరిగే మాటలు సగటు మధ్యతరగతి లేదా పేద కుటుంబాల్లోని గొడవలు, ప్రేమలు, ఆవేదనలను ప్రతిబింబిస్తాయి.

**5.3. వాస్తవిక చిత్రణ (Realism):**

కులవృత్తులు ఎలా దెబ్బతింటున్నాయి, కూలీలు నగరాలకు ఎలా వలస వెళ్తున్నారు అనే అంశాలను రచయిత చాలా సహజంగా చిత్రించారు. మేదర వృత్తిలోని కష్టనష్టాలను సంగమేసు తన 60 ఏళ్ల అనుభవంతో వివరించే తీరు హృదయానికి హత్తుకుంటుంది.

**6. ముగింపు:**

కథ ముగింపులో రచయిత ఉపయోగించిన 'ప్రతీక' చాలా శక్తివంతమైనది. కోళ్లు, పందులు, కుక్కల మధ్య జరిగే పోరాటాన్ని ఆధునిక ఆర్థిక వ్యవస్థలో బలవంతులు బలహీనులను మింగేసే తీరుకు ప్రతీకగా చూపడం రచయిత సృజనాత్మకతకు నిదర్శనం. 'ఐటెక్కు పెపంచికం' (హైటెక్ ప్రపంచం) అంటూ సామాన్యులను అడుగేసి మట్టేస్తున్నారని సంగమేసు పాత్ర ద్వారా రచయిత తీవ్రమైన సామాజిక విమర్శను, ఆవేదనను వ్యక్తపరిచారు. అలాగే, కార్పొరేట్ శక్తులు పేదవారికి చేసే 'సాయం' వెనుక ఉన్న అసలు రంగును (తక్కువ కూలికి వాడుకోవడం) కూడా ఎండగట్టారు. రచయిత అతి సామాన్యమైన భాషలో, లోతైన సామాజిక సత్యాన్ని హృద్యంగా చెప్పడం ఈ కథా రచనా శైలిలోని ప్రత్యేకత.

**7. ఆధార గ్రంథాలు :**


1. 'కథానిక స్వరూప స్వభావాలు', - దక్షిణామూర్తి పోరంకి,
2. "కొత్త బతుకు" - పాలకొల్లు రామలింగస్వామి
3. తెలుగు సాహిత్య చరిత్ర - ఆచార్య వెలమల సిమ్మన్న
4. తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు - ఆచార్య వెలమల సిమ్మన్న
5. తెలుగు సాహిత్య సమీక్ష - ఆచార్య జి.నాగయ్య
6. కథా శిల్పం - వల్లంపాటి వెంకట సుబ్బయ్య